సాక్షి
నంద్యాల
శనివారం : 11 : ఫిబ్రవరి : 2023



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళా వేదికపై శుక్రవారం హైదరాబాద్ కళాకారులు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.



నమో.. నారసింహా!

ఆళ్లగడ్డ: పట్టణ సమీపంలోని దేవరాయపురానికి శుక్రవారం అహోబిలేశుడి పార్వేట పల్లకీ చేరుకుంది. ఉత్సవమూర్తులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,612.97
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:43.765
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,270

న్యూస్‌రీల్

పేదింటి ఆడ బిడ్డలకు ప్రభుత్వం అండ

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధులు విడుదల

నంద్యాల: పేదింటి ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద గతేడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలో వివాహాలు చేసుకున్న జిల్లాలో 271 మందికి రూ.2.34 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. నగదు జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. పేదింటి ఆడబిడ్డలను చదువుల్లో ప్రోత్సహించడం, బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అర్హులైన వారికి ఏటా ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్ నెలల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది.

మహానంది ఈఓగా చంద్రశేఖర్‌రెడ్డి కొనసాగింపు!

మహానంది: మహానంది దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిని మరో ఏడాది పాటు అదే పోస్టులో కొనసాగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఆదేశాలు జారీ చేసినట్లు శుక్రవారం రాత్రి తెలిసింది. గత ఏడాది ఫిబ్రవరిలో మహానంది ఈఓగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఆలయ అభివృద్ధికి పాటు పడుతుండటంతో మరో ఏడాది కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రెండు మూడు రోజుల్లో దేవస్థానం కార్యాలయానికి అధికారికంగా ఉత్తర్వులు రానున్నాయి.

కొనసాగుతున్న నీటి విడుదల



మోటార్ల ద్వారా నీరు సరఫరా అవుతున్న దృశ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీనీవాకు కృష్ణా జలాల సరఫరా కొనసాగుతున్నట్లు పర్యవేక్షక ఏఈఈ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. మల్యాల ఎత్తిపోతల వద్ద నీటి లభ్యత తగ్గిపోడంతో ముచ్చుమర్రి నుంచి నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ నీటి మట్టం 836 అడుగులుగా ఉందని, 810 అడుగుల వరకు పంపింగ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. రోజూ మూడు మోటార్లతో 960 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు.

2,400 మంది పోలీసులతో బందోబస్తు

బొమ్మలసత్రం: శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 2,400 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 మంది డీఎస్పీలు, 52 మంది సీఐలు, 120 మంది ఎస్ఐలు, 954 మంది ఏఎస్ఐలు, 106 మంది మహిళా పోలీస్‌లు, 464 మంది హోంగార్డులు, 100 మంది స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ గంగాధర్‌రావు

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలకు నంద్యాల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్‌రావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శైలానికి 50 బస్సులు, మహానందికి 20, ఓంకారానికి 10, భోగేశ్వరానికి 5 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వారు తెలిపారు. బస్సు చార్జీలు యథావిధిగా ఉంటాయన్నారు. శ్రీశైలానికి వెళ్లే భక్తులకు శీఘ్ర దర్శనం, అతి శీఘ్రదర్శనానికి బస్టాండ్ నుంచే బుకింగ్ చేసుకొనే సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రాజ్‌విహార్): మక్కాలో పవిత్ర హజ్ యాత్రకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టేట్ హజ్ కమిటీ సభ్యుడు హాఫీజ్ మంజూర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 10వ తేదీ వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు నేడు అంకురార్పణ



దేదీప్యమానంగా శ్రీశైల ఆలయం

భక్తులు మెచ్చేలా.. బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో శ్రీశైల ఆలయ గాలిగోపురం

- పాగాలంకరణకు శివస్వాములు, సామాన్య భక్తులకు అనుమతి
- పెచ్చెర్వు, కైలాసద్వారం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం
- పాదయాత్ర భక్తులకు కంకణాలతో స్వామి వారి శీఘ్ర దర్శనం
- శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి లవన్నతో 'సాక్షి' ఇంటర్వ్యూ



'ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠం కలసి వెలసిన శ్రీశైల క్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులందరికీ మెరుగైన వసతులు కల్పించనున్నాం. 11 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. క్షేత్ర సంప్రదాయాన్ని అనుసరించి బ్రహ్మోత్సవ క్రతువులు నిర్వహించి భక్తుల మన్ననలు పొందుతాం' అని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న స్పష్టం చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈఓతో సాక్షి ఇంటర్వ్యూ ఇలా..

– శ్రీశైలంటెంపుల్

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న. బ్రహ్మోత్సవాలకు ఎంత మంది భక్తులు వస్తారని అంచనా?

ఈఓ: గత రెండేళ్లుగా కరోనా ప్రభావంతో తక్కువ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ ఏడాది 11 రోజుల్లో మొత్తం 8 లక్షల మంది వస్తారని, శివరాత్రి ఒక్కరోజే క్షేత్రంలో 2 లక్షల మంది ఉంటారని అంచనా వేశాం.

ప్రశ్న: ఏర్పాట్లలో ఏమైనా మార్పులు ఉన్నాయా?

ఈఓ: భక్తుల రద్దీ దృష్ట్యా గతేడాది చేసిన ఏర్పాట్లకు కంటే 40 శాతం అదనంగా చేశాం. నెల రోజుల ముందు నుంచే ప్రణాళికబద్ధంగా మొదలు పెట్టి స్వయంగా పర్యవేక్షిస్తూ వచ్చాం. పాదయాత్ర భక్తులకు మెరుగైన వసతులతో పాటు తర్వితగతిన స్వామి దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: దర్శనానికి ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

ఈఓ: భక్తులందరికీ సౌకర్యవంతమైన స్వామివారి దర్శనం కల్పించేందుకు అలంకార (దూర) దర్శనం ఏర్పాటు చేశాం. జ్యోతిర్ముడి ధరించిన శివస్వాములకు ఈ నెల 15 వరకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నాం. నాలుగు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నాం.

ప్రశ్న: భక్తుల వసతికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

ఈఓ: లక్షలాదిగా తరలివచ్చే భక్తులందరికీ వసతి కల్పించడం కష్టసాధ్యం. సాధారణ భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో రెండు పెద్ద డార్మెంటరీలు ఉన్నాయి. వాటిలో బెడ్, చాప, లాకర్ సౌకర్యం తక్కువ ధరకు కల్పిస్తున్నాం. ఇంకా డార్మెంటరీలను పెంచాల్సి ఉంది. తాత్కాలిక వసతి కోసం క్షేత్రంలోని పలు ప్రదేశాలలో షామియానాలు, పెండ్యాల్స్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న: పాదయాత్ర భక్తుల నీటి కష్టాలను ఎలా పరిష్కరిస్తున్నారు?

ఈఓ: వెంకటాపురం నుంచి కైలాసద్వారం వరకు సుమారు 43 కిలోమీటర్ల దూరం ఉంది. అటవీ ప్రాంతంలో గతంలో మంచినీటి వసతి కల్పించకపోయాం. కానీ ఈ ఏడాది వెంకటాపురం, నాగలూటి, పెచ్చెరువు, భీమునికొలను మెట్లమార్గం, కైలాసద్వారం వద్ద మంచినీటి సదుపాయాన్ని కల్పించాం. కైలాసద్వారం నుంచి మెట్లమార్గంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశాం. మొట్టమొదటిసారిగా ఈ ఏడాది పాదయాత్ర భక్తులకు పెచ్చెరువు, కైలాస ద్వారం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేపడుతున్నాం. పాదయాత్ర భక్తులకు కైలాసద్వారం వద్ద రిస్ట్ బ్యాండ్ (దర్శన కంకణాలు) అందించి శీఘ్రదర్శనం క్యూలైన్ ద్వారా త్వరితగతిన మల్లన్న దర్శనం కల్పిస్తున్నాం.

ప్రశ్న: పాతాళగంగలో నీటిమట్టం తగ్గుతుంది? పుణ్యస్నానాలకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

ఈఓ: పాతాళగంగలో నీటిమట్టం గణనీయంగా తగ్గుతుంది. అందుకే పాతాళగంగ వద్ద జల్లు (షవర్‌బాత్) స్నానాలకు ఏర్పాట్లు చేశాం. గంగాభవాని స్నానఘట్టాల వద్ద కూడా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించవచ్చు. రెండు చోట్ల మహిళలు దుస్తులు మార్చుకునేందుకు, శౌచాలయాలకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చాం.

ప్రశ్న: భక్తులకు ఎటువంటి వైద్యసేవలు అందిస్తున్నారు?

ఈఓ: దేవస్థానం వైద్యశాల, ప్రభుత్వ పీహెచ్‌సీతో పాటు 30 పడకల తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేస్తున్నాం. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో కాలినడక అటవీమార్గంలో 5 మెడికల్ క్యాంప్‌లు, క్షేత్ర పరిధిలో ముఖ్యమైన చోట్ల 8 మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సున్నిపెంటలో తాత్కాలిక బ్లడ్‌బ్యాంక్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాం. అడవిమార్గంలో అస్వస్థతకు గురైన భక్తులను తీసుకొచ్చేందుకు 8 మంది చెంచులతో స్ట్రెచ్చర్స్ ఏర్పాటు చేస్తున్నాం. కైలాసద్వారం వద్ద 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాం.

ప్రశ్న: భక్తులకు మీరిచ్చే సూచన?

ఈఓ: బ్రహ్మోత్సవాలకు భారీ స్థాయిలో తరలి వచ్చే భక్తులు దేవస్థానం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకుని ఉత్సవాలను తిలకించాలి. శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దివ్యదర్శనం చేసుకుని, స్వామిఅమ్మవార్ల కృపాకటాక్షాలను పొందాలి. ఉత్సవాల ఆనందంతో క్షేమంగా తిరిగి వెళ్లాలని కోరుకుంటున్నా.

ప్రశ్న: ఎన్ని క్యూకాంప్లెక్స్‌లు ఉన్నాయి? భక్తుల రద్దీని ఎలా నియంత్రిస్తారు?

ఈఓ: 14 కంపార్ట్‌మెంట్లలో ఉచిత దర్శన భక్తులు, 8 కంపార్ట్‌మెంట్లలో శీఘ్రదర్శనం (రూ.200) భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. శివదీక్షా భక్తుల సౌకర్యార్థం చంద్రవతి కల్యాణ మండపంలో 4 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశాం. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు నంది మండపం నుంచి ఉచిత దర్శన క్యూలైన్ వరకు ఉన్న దుకాణాలను తొలగించి క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: పాగాలంకరణకు సామాన్య భక్తులను అనుమతిస్తారా?

ఈఓ: శివరాత్రి రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో పాగాలంకరణ జరుగుతుంది. పాగాలంకరణ తిలకించేందుకు భక్తులను అనుమతించేందుకు శివరాత్రి రోజున రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు 4 వేల మంది శివస్వాములను, 2 వేల మంది సాధారణ భక్తులను అనుమతిస్తాం. పాగాలంకరణ చేసేటప్పుడు ప్రముఖ ప్రవచకులతో పాగాలంకరణ విశిష్టత, ప్రాశస్త్యం తెలిసేలా వ్యాఖ్యానం ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: బ్రహ్మోత్సవ క్రతువులు ఎలా నిర్వహిస్తారు?

ఈఓ: శనివారం నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఆగమ శాస్త్రానుసారంగా క్షేత్ర సంప్రదాయాన్ని అనుసరించి నిర్వహిస్తాం. ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తాం. పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశాం. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలు దేవస్థానాలు, రాష్ట్ర ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పించనుంది.

ముస్తాబైన శ్రీగిరి

- 11 రోజులు స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలు, గ్రామోత్సవం
- 18న పాగాలంకరణ, కల్యాణోత్సవం
- నేడు శ్రీకాళహస్తి దేవస్థానం వారిచే స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ జరుగనుంది. ఉదయం యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవ క్రతువులు ప్రారంభమవుతాయి. ఉదయం 8.46 గంటలకు యాగశాల ప్రవేశం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు సాయంకాలార్చనలు, అగ్నిప్రతిష్ఠాపన, అంకురార్పణ నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు త్రిశూలపూజ, భేరిపూజ, సకల దేవతాహ్వానపూర్వక ధ్వజారోహణ, ధ్వజపట ఆవిష్కరణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి అయిన భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు, స్వామిఅమ్మవార్లకు వివిధ వాహనసేవలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవాలయాలను వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వారిచే స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామిఅమ్మవార్లకు సమర్పిస్తారు.

విశేష వాహనసేవల వివరాలు ఇలా..

తేదీ	వాహన సేవ
12	భృంగి వాహనసేవ
13	హంస వాహనసేవ
14	మయూర వాహనసేవ
15	రావణ వాహనసేవ
16	స్వామిఅమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ
17	గజ వాహన సేవ
18	ప్రభోత్సవం, నందివాహనసేవ,రాత్రి 10 గంటలకుపాగాలంకరణ,కల్యాణోత్సవం
19	స్వామిఅమ్మవార్లకురథోత్సవం, తెప్పోత్సవం
20	బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజావరోహణ
21	అశ్వ వాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ

బాల్య వివాహాలను అరికట్టాలి



ఉపాధ్యాయినితో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ లక్ష్మీదేవి

ఉయ్యాలవాడ: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ లక్ష్మీదేవి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పుచ్చకాయలపల్లె కస్తూర్బా బాలికల పాఠశాల, కాకరవాడ, పుచ్చకాయలపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు క్షేత్రస్థాయికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. 10వ తరగతి కస్తూర్బా విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయినిలకు సూచించారు. ఆమె వెంట సీడీపీఓ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీశైలజ తదితరులు ఉన్నారు.

కర్నూలులో రామ్‌చరణ్ సినిమా షూటింగ్



కొండారెడ్డి బురుజుపై హీరో రాంచరణ్, శ్రీకాంత్, రాజీవ్ కనకాల

కర్నూలు కల్చరల్: నగరంలోని కొండా రెడ్డి బురుజు వద్ద సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శుక్రవారం మెగా సినీ హీరో రామ్‌చరణ్ తేజ్, నటులు శ్రీకాంత్, రాజీవ్ కనకాలపై కొండారెడ్డి బురుజుపై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. రామ్ చరణ్ తేజ్ హీరోగా దిల్‌రాజు నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో కొత్త చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. సినిమాలో హీరో ఒక రాజకీయ పార్టీ నాయకునిగా ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యాలు చిత్రీకరించారు. సినిమా హీరో, నటులను, సినిమా షూటింగ్ చూసేందుకు కొండారెడ్డి బురుజు ప్రాంతానికి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించండి

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు పరిచేందుకు ప్రతి మండలంలో ఎంసీసీ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 641 క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్లను వెంటనే పరిశీలించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో డూప్లికేషన్, అర్హత లేని వారుంటే వెంటనే తొలగించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి సిబ్బంది వివరాలు తెప్పించుకొని ఎన్నికల విధులు కేటాయించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. పోలింగ్ సరళిపై సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను పరిశీలించాలన్నారు. గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

రీ సర్వే పూర్తి చేయండి

ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కింద స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో పీఓఎల్ఆర్ రీ సర్వే, 90 రోజుల ఇళ్ల పట్టాలు, జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం, పౌరసరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, పర్యాటక ప్రదేశాలు, పరిశ్రమలకు అవసరమై పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, రెవెన్యూ సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి గురువారం సీసీఎల్ఏతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం.దాసు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా చైతన్య రాయలు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా చైతన్య రాయలును నియమించారు. ప్రస్తుతం ఆయన కర్నూలు జాయింట్‌-2 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్‌ను ఏసీబీ అరెస్టు చేయడంతో దాదాపు మూడు నెలలుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రభావతికి కొన్నాళ్లు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె కూడా తాను పనిచేయలేనని చెప్పడంతో శీనా నాయక్ అనే మరో సీనియర్ అసిస్టెంట్‌ను జనవరి 17వ తేదీన ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన కూడా మూడు రోజులు పనిచేసి తాను చేయలేనని చెప్పడంతో శుక్రవారం కర్నూలులో ఉన్న చైతన్య రాయలును డెప్యూటేషన్‌పై కల్లూరుకు పంపుతూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన మధ్యాహ్నమే బాధ్యతలు తీసుకున్నారు.

చురుగ్గా సుంకేసుల రోడ్డు నిర్మాణం



సుంకేసుల సమీపంలో బీటీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం సుంకేసుల నుంచి తిమ్మందొడ్డి వరకు బీటీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లను మంజూరు చేసింది. సుంకేసుల మెయిన్ రోడ్డులోని తులశాపురం నుంచి సుంకేసుల మీదుగా తిమ్మందొడ్డి వరకు బీటీ రోడ్డు పనులు సాగుతున్నాయి. మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పీ మార్ట్ కేంద్రాల ఏర్పాటుకు 75 శాతం సబ్సిడీ

● జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మాంసం అందించేందుకు పీ మార్ట్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని జాతీయ మాంసం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పీ మార్ట్ పరికరాలను రూపొందించారన్నారు. ఇందులో నాలుగు రకాల పరికరాలు ఉన్నాయని, యూనిట్ కాస్ట్ రూ.15.34 లక్షలు ఉండగా, ఇందులో 75 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. 200 చదరపు అడుగుల స్థలంలో పీ మార్ట్ పరికరాలను అమర్చుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు. పీ మార్ట్ మాంసం విక్రయ కేంద్రాలను రాష్ట్ర మాంసం అభివృద్ధి సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన చెప్పారు.

వైద్యం.. అపు‘రూపం’



డోన్‌లో నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రి



పూర్తయిన నందికొట్కూరు సీహెచ్‌సీ భవనం

ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు.. బీటలు వారిన గోడలు.. పెచ్చులూడిన పైకప్పులు.. వర్షం కురిస్తే కారే గదులు.. ఇదీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ఒకనాటి దుస్థితి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో వీటి రూపు రేఖలు మారాయి. నాడు–నేడు పనుల కింద రూ.119.20 కోట్లు కేటాయించడంతో నూతన భవనాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. రోగులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

- మారుతున్న సీహెచ్‌సీల రూపురేఖలు
- నాడు–నేడు పనుల కింద పనులు
- రూ.119.20 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- రోగులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు



నిర్మాణం పూర్తి చేసుకుంటున్న బనగానపల్లె ఏరియా ఆసుపత్రి భవనం



నిర్మాణం పూర్తయిన ఆత్మకూరు సీహెచ్‌సీ భవనం

కర్నూలు(హాస్పిటల్):ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, నంద్యాల బోధనాసుపత్రి, డోన్, బనగానపల్లె, ఆదోనిలలో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి.వీటితోపాటు మరో 15 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 40 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఆసుపత్రుల్లో పాడైన ప్రతి భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగా నాడు–నేడు కింద కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,ఏరియా ఆసుపత్రుల రూపురేఖలు మారుస్తోంది. ఇందులో కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.119.20 కోట్లను ఖర్చు చేస్తోంది.మొత్తం 16 భవనాల్లో ఇప్పటికే సగం పూర్తయ్యాయి. మరో సగం ఆరు నెలల్లోపు పూర్తి కానున్నాయి.

అన్ని రకాల వైద్య సేవలు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒక గైనకాలజిస్టు, ఒక పీడియాట్రిస్ట్, ఒక అనెస్తెటిస్ట్, ఒక జనరల్ మెడిసిన్, ఒక జనరల్ సర్జన్, ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయి వైద్యులు ఉంటారు. వీరితోపాటు నర్సులు, ఇతర సిబ్బంది కలిపి ప్రతి సీహెచ్‌సీలో 31 మంది వరకు పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆలూరు, పత్తికొండలో ఇద్దరు వైద్యులు సెలవుపై వెళ్లగా కోడుమూరులో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంది. ఇతర అన్ని చోట్ల వైద్యం అందుతోంది. ఆయా ఆసుపత్రుల పరిధిలో సాధారణ, సిజేరియన్ ప్రసవాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స చేయడంతో పాటు అత్యవసర మెడికల్ వైద్యాన్ని కూడా అందించేందుకు వైద్యులను నియమించారు. ఈ మేరకు ఆయా సీహెచ్‌సీ భవనాల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నారు. పెద్ద పెద్ద జబ్బులకు మాత్రమే కర్నూలు, నంద్యాల లాంటి ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేసేందుకు విధంగా వైద్యులను తీర్చిదిద్దుతున్నారు. మరో మూడు నుంచి ఆరు నెలల్లో మొత్తం సీహెచ్‌సీల్లో పూర్తిస్థాయి వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఆయా ఆసుపత్రులకు కేటాయించిన నిధులు

ఆసుపత్రి పేరు	పడకల సంఖ్యపెంపు	కేటాయించిన నిధులు రూ.కోట్లలో
ఆదోని ఏరియా ఆసుపత్రి	100	10.48
డోన్ ఏరియా ఆసుపత్రి	100	26.00
బనగానపల్లె సీహెచ్‌సీ	50 నుంచి 100	22.00
కోవెలకుంట్ల సీహెచ్‌సీ	30	3.80
అవుకుసీహెచ్‌సీ	30	2.43
డోన్‌న్ సీహెచ్‌సీ	30 నుంచి 50	3.00
ఎమ్మిగనూరు సీహెచ్‌సీ	50 నుంచి 100	12.60
ఆళ్లగడ్డ సీహెచ్‌సీ	30 నుంచి 50	12.60
ఆలూరుసీహెచ్‌సీ	30	2.73
కోడుమూరు సీహెచ్‌సీ	30	2.22
యాళ్లూరు సీహెచ్‌సీ	30	5.33
ఓర్వకల్ సీహెచ్‌సీ	30	5.84
వెల్దుర్తి సీహెచ్‌సీ	30	5.77
ఆత్మకూరు సీహెచ్‌సీ	30	3.20
వెలుగోడు సీహెచ్‌సీ	30	6.10

సీహెచ్‌సీ భవనాల్లో సగం పూర్తి



ఉమ్మడి జిల్లాలో మూడు ఏరియా ఆసుపత్రులు, 13 సీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నాం. ఇందులో ఇప్పటికే సగం పూర్తయ్యాయి. మరో సగం మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తవుతాయి. భవనాలతో పాటు అందులో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కూడా అందుబాటులోకి వస్తాయి. రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

–రాజగోపాల్‌రెడ్డి, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

భవనాలు పూర్తయితే మెరుగైన సేవలు

ప్రస్తుతం సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో రోగులకు మంచి సేవలు అందుతున్నాయి. దీంతోపాటు కొత్త భవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా శరవేగంగా చర్యలు చేపడుతోంది. నూతన భవనాల నిర్మాణాలు పూర్తయితే నియోజకవర్గస్థాయిలోనే పెద్ద ఆసుపత్రుల్లో అందే సేవలు ఇక్కడే అందే అవకాశం ఉంది.

–డాక్టర్ రాంజీనాయక్, డీసీహెచ్‌ఎస్, కర్నూలు

టెక్నికల్ కోర్సు పరీక్షలకు నోటిఫికేషన్

కర్నూలు సిటీ: టెక్నికల్ కోర్సు పరీక్షలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఈఓ రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్, హ్యాండ్ లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ విభాగాల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో పరీక్షలు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. లోయర్ గ్రేడ్ పరీక్షలు రాసేందుకు 7వ తరగతి, ఆపై తరగతులు పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. లోయర్ గ్రేడ్‌లో ఉత్తీర్ణత పొందిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాయవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్న వారు www. bse. ap. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు పత్రాలు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు జతపరిచి పరీక్షల విభాగం కర్నూలు వారికి పంపించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పదోన్నతి పరీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేసే సిబ్బందికి పదోన్నతులు కల్పించేందుకు అర్హత పరీక్ష నిర్వహించారు. కర్నూలు మద్దూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో ఎంటీలు, ఎల్‌-1, ఎల్‌-2, ఎల్‌-3 కేడర్లకు చెందిన 80 మంది పరీక్షకు హాజరయ్యారు. వ్యవసాయ విభాగంలో పనిచేసే సిబ్బందిలో అర్హత పొందిన వారికి ఎస్ఎఫ్ఏ, మెంటార్, ఎంటీలుగా పదోన్నతి లభించనుంది. పరీక్షను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, ఎస్పీఎంయు థీమ్యాటిక్ సురేష్‌బాబు పర్యవేక్షించారు. అంతకు ముందు ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో జరిగిన సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెర్లోపల్లె గ్రామానికి చెందిన మురారి రామాంజనేయులు(34) నాపరాళ్ల లోడింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. అదే గ్రామ సమీపంలోని పెద్ద కంబగిరిస్వామి ఫ్యాక్టరీ వద్ద పని నిమిత్తం నిలిచి ఉండగా ట్రాక్టర్ రివర్స్‌లో వచ్చి అతన్ని ఢీకొట్టింది. దీంతో అతను నాపరాళ్లపై పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని భార్య పుష్పావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. రామాంజనేయులుకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

నకిలీ ఏటీఎం కార్డుతో మోసం

కోవెలకుంట్ల: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో నకిలీ ఏటీఎం కార్డు ఇచ్చి మహిళను మోసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. పట్టణానికి చెందిన షేక్ జరీనాబీ అనే మహిళ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లింది. రూ. 20వేలు డబ్బులు డ్రా చేసుకున్న తర్వాత మరో రూ. 20 వేలు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించింది. డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో పక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి ఏటీఎం ఇచ్చింది. అతను లావాదేవీలు జరిపే క్రమంలో ఆమె ఏటీఎం కార్డు తీసుకుని నకిలీ ఏటీఎంకార్డు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం బాధిత మహిళ ఏటీఎంలో చెక్ చేసుకోగా ఆమె ఖాతా నుంచి రూ. 43,500 విత్ డ్రా అయినట్లు తేలింది. దీంతో మోసపోయానని భావించిన మహిళ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

గడివేముల: పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నంద్యాల జిల్లా విద్యాధికారి అనురాధ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కరిమద్దెల జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు –నేడు పనులను పరిశీలించారు. అనంతరం 3, 4 తరగతుల విద్యార్థుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించిన వర్క్ పుస్తకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మరో 65 సోలార్ డ్రైయింగ్ యూనిట్ల ఏర్పాటు

● ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సోలార్ డ్రైయింగ్ యూనిట్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభు త్వం ప్రోత్సహిస్తోందని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఇప్పటి వరకు కల్లూరు మండలం తడకనపల్లిలో 16, బేతంచెర్ల మండలంలో 16 సోలార్ డ్రైయింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయని తెలిపారు. తడకనపల్లిలో మరో 15, కోడుమూరు మండలంలో 50 యూనిట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. శుక్రవారం కర్నూలు లోని ఓ హోటల్‌లో ఉద్యాన శాఖ– ఆంధ్రప్రదేశ్ మహిళ అభివృద్ధి సొసైటీ(ఏపీ ఎంఎఎస్) సంయుక్తంగా ఉల్లి రైతులతో నిర్వహించిన వర్క్‌షాపునకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఏటా 30 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 20వేల హెక్టార్లలో ఉల్లి సాగవుతోందన్నారు. మొత్తం 6 లక్షల టన్నుల దిగుబడి వస్తోందని తెలిపారు. సోలార్ డ్రైయింగ్ యూనిట్ కాస్ట్ రూ.1.20 లక్షలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ ఇస్తోందని పేర్కొన్నారు. అలాగే రైతులు పండించిన ఉల్లికి మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేనపుడు కొద్ది రోజులు నిల్వ చేసుకునేందుకు ఉద్యాన శాఖ 50 శాతం సబ్సిడీతో గోదాములు కూడా నిర్మిస్తోందని తెలిపారు. నాబార్డు డీడీఎం పార్థవ మాట్లాడుతూ రైతులు సంఘటితమై పండించిన పంటలను మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ.. ఉల్లి సాగులో సమర్థవంతంగా రాణించాలంటే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ ఈడీ మధుమూర్తి, ఉద్యానాధికారి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు సోలార్ డ్రైయర్లు

పొదుపు మహిళలకు సబ్సిడీపై సోలార్ డ్రైయర్లు ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కోడుమూరు మండలంలో 50 మంది మహిళల చేత సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. తర్వాత పత్తికొండ, ఆస్పరిలో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

శ్రీశైల మల్లన్న తల పాగా ఊరేగింపు



వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట గ్రామంలో శ్రీశైలం మల్లన్న తల పాగా ఊరేగింపు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం రోజు లింగోద్భవ సమయంలో శ్రీశైల పుణ్యక్షేత్రంలో స్వామివారికి గర్భాలయంపై పాగా అలంకరిస్తారు. ఆ పాగాని నేసే అవకాశం రామన్నపేట పంచాయతీ కొత్తనగర్‌కు చెందిన సాధు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులకు దక్కింది. తల పాగాని గ్రామంలో ఊరేగించి శివరాత్రి రోజుకు శ్రీశైలం తీసుకెళ్లనున్నారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశెనగ	5813	8329
ఆముదం	3501	6570
వాము	7140	22199
ఉల్లి	555	1029
ఎండు మిర్చీ	5810	29189
శనగలు	4419	4579
కందులు	2330	7309
మొక్కజొన్న	2035	2135
మినుములు	6791	6950
సోయాచిక్కుడు	4066	4066



కల్లు దుకాణంలో పేలుడు

● ఇరువురికి గాయాలు



పేలుడు ధాటికి చిందరవందరగా ఈత కల్లు దుకాణం

రుద్రవరం: నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామంలో బాంబు పేలుడు కలకలం రేపింది. ఘటనలో ఐదుగురు గాయపడ్డారనే విషయం తెలిసి శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో గ్రామా నికి చేరుకున్నారు. పేలుడు జరిగిన ఈత కల్లు దుకాణాన్ని పరిశీలించి, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుద్రవరానికి చెందిన పెద్ద పుల్ల య్య కొన్నేళ్లుగా ఆలమూరులో ఈత కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు ఉదయాన్నే ఆలమూరుకు వెళ్లి అక్కడ కల్లు విక్రయించి తిరిగి ఇంటికి చేరుకుంటాడు. దిన చర్యలో భాగంగా శుక్రవారం ఆలమూరుకు వెళ్లి కల్లు విక్రయానికి సిద్ధం చేశాడు. అదే గ్రామానికి చెందిన వుశేన్‌బాషా, బోయిని ఎల్లయ్యతో పాటు ఆళ్లగడ్డ మండలం యాదవాడకు చెందిన మరో ఇద్దరు రాగా కల్లు అందించాడు. ఇంతలో ఒక్కసారిగా దుకాణంలో పేలుడు సంభవించగా అందరూ బయటకు పరుగులు తీశారు. పెద్ద పుల్లయ్యతో పాటు వుశేన్‌బాషా, బోయిని ఎల్లయ్యల కాళ్లకు రక్త గాయాలు అయ్యాయి. యాదవాడకు చెందిన ఇరువురికీ ఎలాంటి గాయాలు లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అదే గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై ఎస్ఐ స్పందిస్తూ.. పేలుడు జరిగిన తీరును పరిశీలిస్తే బాంబు కాదని, జంతువుల వేటకు వినియోగించే మందుగుండు సామగ్రిగా తెలుస్తోందన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.